కథ

# సీజనాస్త్రం

"గత పదిహేనేళ్లుగా ధర్మారావు ఈ నియోజకవర్గం నించి గెలుస్తున్నారు. అనవసరంగా డిపాజిట్టు పోగొట్టుకుని..అవమానం ఎందుకు? నేనీసారి నామినేషను వేయదల్చుకోలేదయ్యా!" అన్నాడు బసవయ్య తన స్నేహితుడు ప్లస్ పి.ఎ. అయిన రామారావుతో..

"అదేమిటి? అలాగంటావు నామినేషను వెయ్యి! గెలుపు ఓటమిలు దైవాధీనం. నామినేషను కూడా వేయకుంటే ప్రజలు మన పార్టీ గురించి మర్చిపోతారు. ప్రతిపక్షం లేదు కదాని ఆ ధర్మారావు విర్రవీగుతాడు. రెచ్చిపోడూ అశోక చక్రవర్తి లెవిల్లో!" అన్నాడు రామారావు.

"అదేం విచిత్రమో జనాల్లోకెళ్లి మనమెంత కష్టపడి ప్రచారం చేస్తున్నా మనకు ఓట్లు పడవు. పోనీ రిగ్గింగ్ జరుగుతోందా అంటే అదీ లేదు. ఆ ధర్మారావు ప్రజల మనసు కొల్లగొట్టేస్తున్నాడు కదయ్యా!"

"ప్రజల మనసు కాదు నాబొందా కాదు. సీజన్ బట్టి ప్రచారం చేస్తున్నాడు. అందుకే ఓట్లు పడుతున్నాయి."

"సీజనేమిటయ్యా బాబూ!"

"అది తెలిస్తే ప్రతిసారీ తమరిలా నెత్తిన గుడ్డేందుకేసుకుంటారు. పదేళ్ల క్రితం ధర్మారావుకు ప్రచారంలో కాలు బెణికితే, యాక్సిడెంటు 'బిల్డప్' ఇచ్చి బొటనవ్రేలు దగ్గర్నించి నడుముదాకా బ్యాండేజి వేసుకుని ఇంట్లో కూర్చుని, పెళ్లానికి పది మీటర్ల చీర కట్టించి నాలుగు కిలోమీటర్ల కొంగు చూపించి ఇంటింటికి వెళ్లి ఓట్లు అడుక్కురమ్మన్నాడు. అప్పుడు సింపతీ ఓట్లు కొట్టేసి గెలిచాడు.

అయిదేళ్ల క్రితం మొదటిపెళ్లాం చనిపోయినపుడు భార్యావియోగం అంటూ ఫోటోస్టిల్లిచ్చి, ఆమెతో తన జీవితానుభవాలు అంటూ ఉన్నవీ లేనివీ రాయించి సీరియల్‌గా ఓ మేగజైన్‌లో అచ్చు వేయించి అప్పుడూ ఓట్లు దండుకున్నాడు.

ఈసారి మురికివాడల్లో పిల్లలను భుజాలకెత్తుకుని, వారి ప్రక్కన కూర్చుని భోం చేస్తున్నాడు. మైనారిటీ తీరని పిల్లల ఓట్లు కూడా ఆయనకే పడేలా ఉన్నాయి."

"అయినా ఈ ప్రజలేమిటయ్యా ఇంత టేస్టు లేకుండా బ్రతికేస్తున్నారు. అస్తమానం ఒకటే మనిషిని గుడ్డిగా నమ్మేసి ఓట్లేస్తున్నారేమిటి?"

"ప్రశ్న, జవాబు రెండూ తమరే సెలవిచ్చారు ఇక నేను మాట్లాడేదేమిటి? మన పార్టీ గెలవటానికి కిటుకు చెప్పినవారికి లక్ష రూపాయలు బహుమతి అని ప్రకటిద్దామా?"

"అంతకంటే సిగ్గుచేటు ఇంకోటుండదు"

"పోనీ ఇంకో పని చేద్దాం! మన పార్టీ కార్యకర్తలనందరినీ పిలిపించి అయిడియాలు అడుగుదామా?"

"ఇది కాస్త బాగున్నట్టే ఉంది! అలాగే చెయ్యి!" అన్నాడు బసవయ్య.

★★★

బసవయ్య పార్టీ కార్యకర్తలందరూ సమావేశమయ్యారు.

"గత పదిహేనేళ్లుగా నేను పోటీ చేయటం ఓడిపోవటం నాకేగాక మన పార్టీకే అవమానకరంగా ఉంది. మీరేం చేస్తారో ఎలా ప్రచారం చేస్తారో..గెలవటానికి నాకే అయిడియాలిచ్చినా నేను పాటిస్తాను. ఏది ఏమైనా నేను గెలిచి తీరాలి. నేను గెలవగానే ప్రతి ఒక్కరికీ మంత్రి పదవి ఇస్తానని వాగ్దానం చేస్తున్నాను. అదే నేను మీకిచ్చే పారితోషికం. ఇక మీరు నేను గెలవటానికి మీ మీ తెలివికొద్దీ అస్త్రాలు సంధించవలసిందిగా ఆజ్ఞాపిస్తూ సెలవుతీసుకుంటున్నాను."

చప్పట్లు మిన్నుముట్టాయి. మంత్రి పదవి తాయిలం చూపించగానే ఎవరికి వారే ఉత్సాహంగా ప్రచారం గురించి, వారు సంధించే అస్త్రాల గురించి ఆలోచించుకుంటూ హాలు ఖాళీ చేసి వెళ్లిపోయారు. అందరూ వెళ్లిపోయినా ఓ యువకుడు మాత్రం వెళ్లకుండా అలాగే కూర్చున్నాడు. బసవయ్య అతన్ని అనుమానంగా చూస్తూ అతని దగ్గరకొచ్చాడు. బసవయ్య నోరు విప్పి ప్రశ్నించకముందే

అయిదేళ్ల క్రితం మొదటిపెళ్లాం చనిపోయినపుడు భార్యావియోగం అంటూ ఫోటోస్టిల్లిచ్చి, ఆమెతో తన జీవితానుభవాలు అంటూ ఉన్నవీ లేనివీ రాయించి సీరియల్‌గా ఓ మేగజైన్‌లో అచ్చు వేయించి అప్పుడూ ఓట్లు దండుకున్నాడు. ఈసారి మురికి వాడల్లో పిల్లలను భుజాలకెత్తుకుని, వారిప్రక్కన కూర్చుని భోం చేస్తున్నాడు. మైనారిటీ తీరని పిల్లల ఓట్లు కూడా ఆయనకే పడేలా ఉన్నాయి.

"మీరీ ఎన్నికల్లో తప్పక గెలుస్తారు..కాదు..గెలిపించి తీరతాను..నాకాస్త డబ్బు కావాలి!" అన్నాడతను.

"వెరీగుడ్! మీలాంటి యువత నాముందుంటే నాకు కొండంత బలం. ఎంతకావాలి లక్షా? రెండు లక్షలా?"

"అంతొద్దు! వెయ్యి రూపాయలు చాలు!"

"అంత తక్కువా? లూనా పెట్రోలుకు చాలదుకదయ్యా! డబ్బు గురించి ఆలోచించకు. దండిగా తినిపించు. త్రాగించు. వెదజల్లు...మన పార్టీ గెలవాలి. మంత్రి పదవులు రావాలి."

"సారీసర్! నాకు వెయ్యి రూపాయలు మాత్రం ఇప్పించండి! పార్టీని గెలిపిస్తాను." దృఢంగా అంటున్న ఆ యువకుడిని పిచ్చివాడిని చూసినట్టు చూసి వెయ్యి రూపాయలు ఇప్పించాడు.

"చూడు రామారావ్! ఈ కుర్రాడిని గమనిస్తూండు." అన్నాడు బసవయ్య.

★★★

"ప్రచారాలు ఏ రీతిలో సాగుతున్నాయయ్యా!" అడిగాడు బసవయ్య, రామారావును.

"మంచిగానే సాగుతున్నాయి కానీ ప్రతిపక్షం వాళ్లు మన ప్రచారాలకు ఎత్తుకు పైఎత్తు అన్నట్టు వారి ప్రచారాలు కూడా జోరుగా ఉన్నాయి. మనవాళ్లు ఇంటింటికి వెళ్లి గాజులు, పసుపుకుంకుమ భరిణలిస్తే, ప్రతిపక్షం వాళ్లు లేడీ రిస్టువాచీలు, బొట్టుస్టిక్కర్లు ఇస్తున్నారు. మనవాళ్లు బ్రాందీ తాగిస్తే, వాళ్లు ఫారిన్ సరుకు తెప్పిస్తున్నారు. మనం బాలసుబ్రమణ్యం పాటలేయిస్తే వాళ్లు ఉదిత్ నారాయణ్ పాటలేస్తున్నారు."


"నేననుకున్నంతా అయ్యింది..డబ్బూ పోయి డిపాజిట్ దక్కక..చీ...చీ..అన్నట్టు ఆ వెయ్యి రూపాయలు తీసుకున్న కుర్రకార్యకర్త సంగతేమిటి?"

"ఆ వెయ్యి రూపాయలేం చేశాడో తెలీదు కానీ..ఎలుగెత్తి ప్రచారం చేసింది లేదు. కనీసం ఎదురుపడ్డ వాడికి కూడా, మా పార్టీకి ఓటెయ్యండి అని చెప్పటం లేదు. తిని తిరుగుతున్నాడు. ఇదేంటయ్యా అని నేను నిలదీస్తే 'గెలవకపోతే అప్పుడు చొక్కా పట్టుకు మరీ అడగండి!' అంటూ చిద్విలాసంగా నవ్వుతాడు."

"చీకట్లో పెట్రోమాక్సులా అతని మాటలు నాక్కాస్త ఆశ కలిగిస్తోందయ్యా!" శూన్యంలోకి చూస్తూ అన్నాడు బసవయ్య!

"రాజకీయ నాయకులకు చదువు రాకపోయినా పర్లేదు కానీ మాట్లాడ్డం బాగా రావాలండయ్యా! చీకటిలో చిరుదీపం అనాలి కానీ పెట్రోమాక్సు కాదండయ్యా!" అంటూ జారుకున్నాడక్కడినుంచి రామారావు.

అనుకున్న ప్రకారం ఎన్నికలు జరిగాయి. ఎవరూ రిగ్గింగ్‌కు పాల్పడ లేదు. బాంబుల్లేవు. లాఠీల్లేవు. ఎంతో ప్రశాం



తంగా జరిగాయి. యావత్ రాష్ట్రమంతా ఆశ్చర్యపోయేలా బసవయ్య అత్యధిక మెజార్టీతో గెలిచాడు, ధర్మారావుకు డిపాజిట్ కూడా దక్కలేదు.

బసవయ్యకు పూలదండలు....ఊరేగింపులు.. తప్పెట్లు..తాళాలు..గానాబజానాలు..మంత్రిపదవి..ప్రమాణ స్వీకారాలు..అన్నీ అయిపోయాయి.

బసవయ్య రోజుకు పదిసార్లయినా తనను తాను గిల్లి చూసుకుంటున్నాడు. కలా నిజమా అని. ఉన్నట్టుండి బసవయ్యకు కుర్రకార్యకర్త గుర్తుకొచ్చాడు. రామారావు ద్వారా పిలిపించి

''నేను గెలవటానికి నీవు చేసిన ప్రయోగమేమిటి?'' అని అడిగాడు.

''పెద్దగా నేను చేసిందేమీ లేదు. ప్రజలనాడి చూసి వెయ్యి రూపాయలకే ఓ పత్రికా ప్రకటన ఇచ్చానంతే..''

''పత్రికా ప్రకటనా? ఏమిటది? ఎప్పుడిచ్చావు?''

''మీరు నామినేషను వేసిన మరుసటిరోజే! ఇదిగో ఈపేపరు కటింగ్ చూడండి! మీరు చూసి ఉంటారనుకున్నాను సుమా!'' అంటూ జేబులోంచి ఓ పేపరు తీసి చూపించాడు. అందులో ఇలా ఉంది!

''జాతక చక్రం ప్రకారం ధర్మారావుకు అష్టమశని మొదలయింది. దానికి తోడు అతనింటి వాస్తుదోషం కూడా ఉంది. ఆగ్నేయం పెరిగింది. ఈశాన్యం తరిగింది. ఇంటి ముందు మురికి కాలువ పారుతోంది. కొబ్బరిచెట్లు ఇంటి కంటె ఎత్తున్నాయి. కాబట్టి ఈ ఎన్నికల్లో అతడు గెలవడు. ఇకపోతే బసవయ్యకు శుక్రమహర్దశ మొదలయింది. అతనింటికి వాస్తు అద్భుతంగా ఉంది. అందుకు ఇంటి చుట్టు ఉన్న కంప చెట్లే నిదర్శనం. కాబట్టి బసవయ్య అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ప్రముఖ జ్యోతిశ్శాస్త్రజ్ఞుడు శ్రీ ఉంగశస్వామిగారు, కుంబకోణంలో కుండలిని బ్రద్దలు కొట్టి మరీ నిర్ధారించారు'' పేపరు కటింగ్ చదివి తలెత్తిన బసవయ్యతో,

''ప్రస్తుతం ఈ సీజన్‌లో ప్రజల మెదడులో ఈ జ్యోతిష్యం, వాస్తు తప్ప ఇంకేం లేదు. అందువల్లనే నేను ఈ సీజనాస్త్రం సంధించాను. మన పార్టీ గెలిచింది. మీరూ గెలిచారు!'' అంటున్న కుర్రకార్యకర్త వైపు ఆశ్చర్యంగా చూశాడు బసవయ్య. ★

**ఎ. జయలక్ష్మిరాజు**